క్లుప్తంగా

విద్యార్థుల యోగాభ్యాసం



కంభంలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు యోగా సాధనపై అవగాహన కల్పించారు. యోగా ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం విద్యార్థులకు వివిధ రకాల ఆసనాలు నేర్పించి, వాటి ఉపయోగాలను వివరించారు. యోగాతో ఏకాగ్రత, మానసిక, శారీక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని హెచ్ఎం అబ్దుల్ సత్తార్ పేర్కొన్నా. ఉపాధ్యాయులు వీరనారాయణరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు కోర్టు ఆవరణలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న, రాజీపడదగిన సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్ తదితర కేసులను ఇరుపక్షాల ఆమోదంతో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

మార్కాపురం డీవైఈఓగా శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డి

పొదిలి: పొదిలి మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి మార్కాపురం డీవైఈఓగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎఫ్ఏసీ డీవైఈఓగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. గతంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా, జిల్లా సైన్సు కాంగ్రెస్ అధ్యక్షునిగా శ్రీనివాసరెడ్డి విధులు నిర్వహించారు. డీవైఈఓగా నియమితులైన సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ శరత్

పొదిలి: స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఫ్లోరోసిస్ నివారణ, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించారు. డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలు, నివారణ, వైద్య సేవల గురించి వివరించారు. ముందుగా సిబ్బంది అవగాహన కలిగి ఉండి, ప్రజలకు జాగ్రత్తల గురించి తెలియజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ వి.అనిల్‌కుమార్, ఎల్‌టీ అంజిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ లేళ్ల శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి అభినందన



ఫాతిమాను అభినందిస్తున్న అధికారులు

పొదిలి: ఇంటర్మీడియెట్ బైపీసీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 437/440 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మహ్మద్ తహీరా ఫాతిమాను స్థానిక వివేకానంద కళాశాల యాజమాన్యం కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు అభినందించారు. విద్యుత్ ఏడీఈ హరిబాబు, కార్యాలయ సిబ్బంది ఫాతిమాను సన్మానించి, రూ.5 వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా మార్కులు పొంది, తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

నేడు రెవెన్యూ డే ర్యాలీ

బేస్తవారిపేట: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జితేంద్రకుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొనాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి

అర్ధవీడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును పెంచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంఈఓ-2 లక్ష్మీనాయక్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కాగా పాపినేనిపల్లి గ్రామంలో స్పెషల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సలోమి, ఉపాధ్యాయులు గురువారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అభ్యర్థించారు.

సబ్సిడీ దూరం.. అదనపు వడ్డీ భారం



బేస్తవారిపేటలోని పీడీసీసీ బ్యాంక్

కొత్త రుణాలు, లోన్ రెన్యువల్ కోసం అన్నదాతల అవస్థలు

- బేస్తవారిపేట పీడీసీసీబీ మేనేజర్ సెలవుపై వెళ్లడంతో సమస్య
- సకాలంలో రెన్యువల్ కాని 100 మందికి పైగా రైతుల రుణాలు
- కొత్త రుణాల కోసం ఎదురుచూస్తున్న మరో 100 మంది రైతులు

బేస్తవారిపేట:

రైతులు ఖరీఫ్ సీజన్‌లో సేద్యానికి సిద్ధమవుతున్నారు. వేసవి దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్నారు. పెట్టుబడికిగాను బయట అధిక వడ్డీకి అప్పు తెచ్చుకోలేక సహకార బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. బేస్తవారిపేట పీడీసీసీబీ(ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్) బ్యాంక్ పరిధిలో బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. మూడు మండలాల్లోని రైతులు ఈ బ్యాంకులో వ్యవసాయ పంట రుణాలు ఎక్కువగా తీసుకుంటున్నారు. గత రెండు నెలలుగా బ్యాంకులో పనిచేసే మేనేజర్ సెలవుపై వెళ్లడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.

కొత్త రుణాల కోసం..

రెండు నెలల్లో కొత్తగా బ్యాంకు రుణం తీసుకునేందుకు 95 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్ట్‌గేజ్ చేయించారు. పాస్ పుస్తకాలు, 1బీ, అడంగల్, రుణం పొందేందుకు అవసరమైన అన్ని ధ్రువపత్రాలను బ్యాంక్ అధికారులకు సమర్పించారు. మేనేజర్ లేని కారణంగా రుణాలు మంజూరు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. బ్యాంకు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం లేకుండపోతోందని రైతులు వాపోతున్నారు.

రైతులకు అదనపు భారం

గతంలో బ్యాంకు రుణం పొందిన రైతులు ఏడాది పూర్తి కాగానే తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలి. అయితే సకాలంలో రెన్యువల్ చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీని రైతులు కోల్పోవాల్సి వస్తోంది. గడిచిన రెండు నెలల వ్యవధిలో 100 మంది రైతులకు సంబంధించిన రుణాల రెన్యువల్ ప్రక్రియ పెండింగ్‌లో పడింది. వీరందరూ డబ్బు చెల్లించేందుకు సిద్ధంగానే ఉన్నా మేనేజర్ లేరన్న కారణంతో రెన్యువల్ చేయలేదు. ఫలితంగా ప్రభుత్వం అందించే సబ్సిడీ కోల్పోవడంతోపాటు సకాలంలో డబ్బు చెల్లించనందుకు అదనపు వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో బ్యాంకు రుణం రెన్యువల్ చేసుకుంటే 7 శాతం వడ్డీ పడుతుంది. రెండు నెలలు ఆలస్యమైనందున రైతులు 13 శాతం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.లక్షకు రూ.3 వేలు, రూ.రెండు లక్షలకు రూ.6 వేలు, రూ.మూడు లక్షలకు రూ.9 వేలు.. ఇలా వడ్డీ రాయితీని రైతులు కోల్పోయారు. ఎల్‌టీ రుణాలు, గోల్డ్ లోన్స్ కూడా రెన్యువల్ చేయడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

బ్యాంకులో పనిచేసే మేనేజర్ మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో సమస్య తలెత్తింది. డిప్యుటేషన్‌పై మేనేజర్‌ను నియమించడంతో కొత్త రుణాలు, రెన్యువల్స్ చేయడం లేదు. ఎఫ్ఏసీ మేనేజర్‌ను నియమించాల్సిన అవసరం ఉంది. రైతుల సమస్యను జిల్లా అధికారుల దృష్టికితీసుకెళ్లాం.

– సిద్దయ్య, బ్యాంకు సూపర్‌వైజర్

బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా..



కొత్తగా రుణం తీసుకునేందుకు నెలన్నర క్రితం దరఖాస్తు చేసుకున్నా. బ్యాంకు సీఈఓకు పాస్ పుస్తకం, 1బీ, అప్లికేషన్ ఇవ్వడం జరిగింది. మార్టిగేజ్ కూడా చేశారు. మేనేజర్ లేరని రుణం మంజూరు చేయకుండా తిప్పుతున్నారు. పంటలు సాగు చేసే సమయం కావడంతో రుణం మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– మాచర్ల భూపాల్‌రెడ్డి, రైతు, చెట్టిచర్ల

వడ్డీ రాయితీ పోయింది



పంటలకు పెట్టుబడి కోసం బ్యాంకులో రూ.2.40 లక్షల రుణం తీసుకున్నా. ఈనెల 12వ తేదీకి రెన్యువల్ చేయాల్సి ఉంది. డబ్బు కట్టేందుకు బ్యాంకుకు వెళ్తే మేనేజర్ లేరని రెన్యువల్ చేయడం లేదు. సకాలంలో రెన్యువల్ చేయకపోవడంతో ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీ దాదాపుగా రూ.7 వేలు కోల్పోయా. 13 శాతం వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఆవులమంద వెంకట రమణ, రైతు

వేతనం పెంచాలి.. సమస్యలు తీర్చాలి

- మార్కాపురంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీ తర్వాత నుంచి సమ్మెకు దిగుతున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో కాంట్రాక్టు కార్మికులు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలన్నారు. జీఓఎంఎస్ నం.36 ప్రకారం వేతనాన్ని వెంటనే పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కార్మికుల వారసులకు ఉద్యోగం ఇవ్వాలని, సమాన పనికి సమానవేతనం అమలు చేయాలన్న దీర్ఘకాల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వేతనం పెంచకుంటే, మున్సిపల్ కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్, మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్ష్య కార్యదర్శులు సుబ్బరాయుడు, హరికృష్ణ, ఇమాంసా, నాయకులు సలాంఖాన్, చెన్నకేశవులు, సమ్మద్, కనకయ్య, శివ, యుసఫ్, శ్రీను పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ మాధవరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం రవాణాశాఖ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు తమ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకుని, సర్టిఫికెట్లు పొందాలని ఎంవీఐ మాధవరావు సూచించారు. జిల్లా ఉప రవాణా అధికారి ఆదేశాల మేరకు గురువారం మార్కాపురంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సుల్లో ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, మెడికల్ కిట్, ఫైర్ సిలిండర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. తనిఖీల సమయంలో కిట్లు లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కూల్ బస్సుల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదల నివారణపై సూచనలిచ్చారు.

3 రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం సబ్‌స్టేషన్ ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం శుక్ర, శని, ఆదివారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక విద్యుత్‌శాఖ డీఈఈ బి.శేషగిరిరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంబవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. 20 వ తేదీన ఉయ్యాలవాడ సబ్ స్టేషన్, సంజీవరాయుడుపేట సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా ఆయా గ్రామాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని డీఈఈ కోరారు.

బైకులు ఢీ.. నలుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన రమణారెడ్డి

రాచర్ల: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం రాచర్ల మండలంలోని అనుములపల్లె గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. జేపీ చెరువు గ్రామానికి చెందిన చెదులూరి రమణారెడ్డి తన బైక్‌పై గిద్దలూరు వెళ్లి స్వగ్రామానికి వస్తున్నాడు. చోళ్లవీడు గ్రామానికి చెందిన రమణ, నెమిలిగుండం, దానమయ్య కలిసి బైక్‌పై గిద్దలూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో అనుములపల్లె సబ్‌స్టేషన్ సమీపంలో మూలమలుపు వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో జేపీ చెరువు గ్రామానికి చెందిన చెదులూరి రమణారెడ్డి తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. మరో బైక్‌పై ఉన్న ముగ్గురికీ స్వల్పగాయలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. రమణారెడ్డిని మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలించినట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై ఆదిశేషయ్య పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమానత్వమే సాయితత్వం



ప్రవచనకర్తను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో షిరిడీ సాయిబాబా మందింలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా సాయిసత్‌చరిత్రపై రిటైర్డ్ ఈఈ ఎల్‌వీ సుబ్రమణ్యంరెడ్డి ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. సాయినాథుడు సర్వదేవతా స్వరూపుడని పేర్కొన్నారు. ప్రతి రోజు భిక్షాటన చేసి సర్వజీవులకు ఆహారం పంచేవారన్నారు. ఆలయ కార్యదర్శి గోపాలుని హరిహరరావు మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీ వరకు రోజూ ప్రముఖ వక్తలతో సాయిచరిత్రపై ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రామడుగు గోపి, కోశాధికారి నాగరాజు, కమిటీ సభ్యులు గోపాలుని కృష్ణమోహన్, కరీం, పవన్, విజయ్, మహిళా సంఘ సభ్యులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సాయిసత్‌చరిత్ర పారాయణం చేశారు.

అక్రమ అరెస్టులు కాదు.. సంక్షేమ పథకాలు అమలు చేయండి

- కూటమి సర్కారుకు
మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి హితవు



జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: మాజీ ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నేతల అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం తగినమూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ప్రజలు ఓటేసింది సూపర్ 6 పథకాలు ఆశించి అని, వాటిని విస్మరించి కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతల అక్రమ అరెస్టులకు తెరలేపిందని విమర్శించారు. సూపర్-6 పథకాలు అమలు చేయకపోతే ప్రజలు నిలదీస్తారన్న ఆందోళనతో వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తూ వీటిపైనే చర్చ జరిగేలా చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలకు అన్నీ గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వ కుయుక్తులను ఇప్పటికే గ్రహించారని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూటమి ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చినప్పుడు పొదిలి పట్టణం జనసముద్రంగా మారిన దృశ్యాన్ని కూటమి ప్రభుత్వం ఓర్వలేక అమాయక రైతులపై కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులను ఆపి సూపర్ 6 పథకాలను అమలు చేస్తే కాస్త గౌరవమైన ఓటమి దక్కుతుందన్నారు. అలా కాకుండా సంక్షేమాన్ని గాలికొదిలేసి వైఎస్సార్ సీపీ నేతలను అక్రమ అరెస్టు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటే మాత్రం వచ్చే ఎన్నికల్లో కూటమి పార్టీలు నామరూపాల్లేకుండా పోవడం తథ్యమన్నారు.

మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న ముస్లిం సంఘ నాయకులు

- ముస్లిం సంఘ నాయకుల డిమాండ్

గిద్దలూరు రూరల్: మసీదుల్లో పనిచేస్తున్న మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలని ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. పట్టణంలోని బిలాల్ మసీదులో గురువారం ముస్లిం సంఘ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదుల్లో పనిచేస్తున్న మౌజన్లు గౌరవ వేతనం అందక లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మౌజన్లకు మసీదు కమిటీ వారు వేతనం చెల్లించలేక అవస్థలు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ముస్లింల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం సంఘ నాయకులు నాయబ్‌రసూల్, ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర హాజరు పెంచేందుకు తంటాలు



యోగా హాజరు శాతం పెంచే పనిలో ఉద్యోగులు

బేస్తవారిపేట: యోగాంధ్ర హాజరు శాతం తక్కువగా ఉండటం, సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేయడం కోసం సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు నానా తంటాలు పడుతున్నారు. హాజరు 50 శాతం కంటే తక్కువగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద తమ మొబైల్ ఫోన్లతో కుస్తీలు పడుతున్నారు. ప్రభుత్వం పబ్లిసిటీ యావతో ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతోందని ఓ వైపు నిరసన వ్యక్తం చేస్తూనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్న పరిస్థితి గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో నెలకొంది. కొందరు ఉద్యోగులకు యాప్‌లో వివరాలు నమోదు చేయడంపై అవగాహన లేకపోవడంతో నేర్చుకునే పనిలో పడ్డారు. ఆన్‌లైన్‌లో యోగా అటెండెన్స్ పెంచడంతోపాటు హాజరు వేసినవారికి సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేయడంతో సచివాలయ ఉద్యోగులు అదే పనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు.

విద్యార్థుల క్రమశిక్షణ టీచర్ల బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలని మార్కాపురం రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రాజమోహన్‌రావు సూచించారు. గురువారం మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనపై అనుమానం వస్తే తక్షణమే కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కూడా పాఠశాలకు పిలిపించి సమాచారం తెలియజేయాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలని, అసభ్యకరంగా ప్రవర్తించే వారి సమాచారం టీచర్లతోపాటు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకునేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com